గురువులేని విద్య గ్రుడ్డివిద్య

"గురువులేని విద్య గ్రుడ్డివిద్య" అనుమాట పూర్వము చాలామంది అనెడివారు. ప్రస్తుతకాలములో ఆ మాట బహు అరుదుగా వినిపిస్తున్నది. దీని అర్థము ఏ విద్యకైనా గురువు అవసరము అని తెలియుచున్నది. ఎవడైన ఏ విద్యనైనా స్వయముగా నేర్వాలనుకొన్నపుడు గురువు లేకుండ ఎంత నేర్చుకొన్నా అది గ్రుడ్డి విద్యేనని పూర్వము పెద్దలనెడివారు. ఈ మాట వాస్తవమేనా అని పరిశీలించి చూస్తే ఏకలవ్యుడు విలువిద్యను గురువు నేర్పకున్నను పట్టుదలగా నేర్చుకోగలిగాడు. ఆయనకది గురితప్పని విలువిద్యే అయినది కానీ గ్రుడ్డివిద్య కాలేదు కదా! అలాగే నేటి కాలములో ఎవరు నేర్పకున్ననూ, డ్రైవర్ విద్యను నేర్చుకొని వాహనములను నడుపువారు గలరు. స్వయాన సంగీతమును నేర్చుకొని, గాన గంధర్వుడని పేరుగాంచిన గాయకుడు బాలసుబ్రమణ్యములాంటి వారూ గలరు. అలాగే కొన్ని విద్యలను కొందరు గురువు లేకుండగనే, అవలీలగ నేర్చుకోగలిగి వాటిలో ప్రావీణ్యత పొందిన వారూ గలరు. ఇటువంటివన్నియు గమనిస్తే గురువులేని విద్య గ్రుడ్డి విద్య అను మాట సత్యమేనా? అని అనుమానము రాక తప్పదు. ఇటువంటి సందర్భములో మనము బాగా యోచించ వలసిన పనియున్నది. తీక్షణముగా యోచించి చూస్తే గురువులేని విద్య గ్రుడ్డివిద్య అను మాటలో మూడు ముఖ్యమైన పదములు గలవు. అవి ఒకటి గురువు, రెండు విద్య, మూడు గ్రుడ్డివిద్య. ఈ మాట ముఖ్యముగ విద్యను గురించి చెప్పిన మాట కావున రెండవ భాగమైన విద్యను గురించి వివరించుకొని చూస్తాము.

'విత్' అను పదము నుండి పుట్టినది విద్య అను పదము. విత్ అనగా తెలియడము అని అర్థము. దాని ప్రకారము ఏదైతే తెలియగల్గుచున్నామో, లేక దేనినైతే నేర్వగలుగుచున్నామో దానిని విద్య అంటున్నాము. దేనినైతే తెలియుచున్నామో దానినే జ్ఞానము అని కూడ అంటున్నాము. దేనినైతే తెలియలేకున్నామో, దానిని అజ్ఞానము అంటున్నాము. దీనిప్రకారము, విద్యను జ్ఞానము అనియు, అవిద్యను అజ్ఞానమనియు అంటున్నాము. అదే విధముగ తెలిసిన దానిని విద్య లేక జ్ఞానము, తెలియని దానిని అవిద్య లేక అజ్ఞానమని అందరికి అర్థమైపోయివుంటుంది. ఇపుడు విద్యనుగానీ, అవిద్యనుగానీ విభజించి చూస్తే రెండు రకములుగా ఉన్నవని తెలియుచున్నది. అవియే ఒకటి ప్రపంచ విద్య, రెండవది పరమాత్మ విద్య. ఈ రెండు విద్యలో గురువులేని విద్య అని దేనిని అన్నారని చూస్తే పరమాత్మవిద్యనే అని తెలియుచున్నది. ఎందుకనగా! ప్రపంచ విద్యలను గురువులేకుండానే నైపుణ్యముగా నేర్వగలుగుచున్నారు. ఆ విద్యలోని ఫలితమును పొందుచున్నారు. అందువలన వృథాకాని పెద్దలమాట పరమాత్మ విద్యను గురించి చెప్పినదని తెలియుచున్నది. దీనినిబట్టి గురువులేని విద్య అను దానిని ఒక పరమాత్మ జ్ఞానము పట్ల మాత్రమే లెక్కించి చూడవలసియున్నది. ఈ మాట ప్రపంచ జ్ఞానమునకుగానీ లేక ప్రపంచ విద్యకుగానీ వర్తించదని తెలియాలి.

ఇపుడు గురువు అను పదమును చూస్తే, విద్యను బట్టి ఈ పదము కూడ ప్రపంచవిద్యకు వర్తించదని తెలియుచున్నది. అందువలన గురువును ఒక పరమాత్మ విద్య అయిన బ్రహ్మజ్ఞానముపట్ల మాత్రము చూడాలి. ఇపుడు అటువంటి గురువులను గమనిస్తే, దైవజ్ఞానమను పేరుతో ఎన్నో జ్ఞానములను తెల్పువారు కలరు. ఎన్నో జ్ఞానములని ఎందుకంటున్నామంటే, ఒకదాని కొకటి కొంత భిన్నముగా ఉండును కనుక అలా చెప్పవలసి వచ్చినది. ఉదాహరణకు ఒక గురువేమో సిద్దసమాధి యోగమని ఒక రక జ్ఞానమును బోధిస్తే, మరియొక గురువు పిరమిడ్ ధ్యానమని బోధిస్తాడు. ఇంకొకరు బ్రహ్మకుమారి సమాజ మార్గమని బోధిస్తారు.

అలాగే మాస్టర్ ధ్యానమని ఒకరూ, రాజయోగ ధ్యానమని ఒకరూ, కుండలీయోగమని ఒకరూ, శ్వాస మీద ధ్యాస అనీ ఒకరూ, మనోయోగమనీ ఒకరూ, అచలయోగమని ఒకరూ, తారక మార్గమని ఒకరూ, సాంఖ్యమార్గమని ఒకరూ, ముక్తిమార్గమని ఒకరూ, కేవలము భక్తిమార్గమని ఒకరూ, నామ జపమని ఒకరూ ఇలాగ ఎందరో ఎన్నో భిన్నమైన విధానములను బోధించుచున్నారు. గమ్యము ఒకటే అయినా, దారులు ఎన్నో అని సమర్థించుకొని భిన్న భిన్నముగా బోధించుచున్నారు. ఈ విధముగా బోధించు వారందరూ గురువులుగానే చలామణి అగుచున్నారు. వీరు బోధించు విద్యలన్నీ గురువు బోధించు విద్యలైనపుడు, అందులో ఏదీ గ్రుడ్డివిద్య కాకూడదు. అన్నీ చూపువున్న విద్యలే అయివుండాలి. అనగా అన్ని విద్యలు దేవుణ్ణి తెలుపు అసలైన బ్రహ్మజ్ఞానమై ఉండాలి. ఇపుడు అసలు విషయానికి వస్తాము నేడు ఇన్ని విధములుగా బోధింపబడు విద్యలన్నీ దేవుణ్ణి తెలుపునవేనా? బోధించువారందరూ గురువులేనా? అని ప్రశ్నించుకొని చూస్తే, ఏ ఒక్క విద్య వలన దేవుణ్ణి చూడలేక పోవుచున్నాము. దీనిని బట్టి, ఇది గ్రుడ్డి విద్య అని ఒక్కొక్క దానిని తీసివేయవలసి వస్తున్నది. దేవున్ని తెలుపలేని విద్య ఏదైతే ఉన్నదో దానిని బోధించిన వాడు గురువు కాదని తెలియుచున్నది. గురువులేని విద్య గ్రుడ్డిది అయినపుడు గ్రుడ్డివిద్యను నేర్పిన వానికి గురువు లేడనియేగా అర్థము. అయితే ఇక్కడ విద్యను లేక జ్ఞానమును గురువే బోధించాడు కదా అని మీకు ప్రశ్నరాగలదు. దానికి మా జవాబు ఏమనగా! దైవజ్ఞానమును పేరుపెట్టి బోధించువాడు గురువు కాడు. అటువంటివాడు బోధకుడే అవుతాడు కానీ గురువుకాడు. దేవున్ని తెలియజేయు బోధ, చూపుకల్గినది కావున అటువంటి జ్ఞానమును బోధించిన వాడు మాత్రమే గురువు అగును.

అయితే ఇపుడు గురువు గురించి, గురువు ఎవరు? గురువు ఎప్పుడు భూమి మీద ఉంటాడు? గురువు బోధించు జ్ఞానము ఎలాగుండును? అను మొదలగు వాటికి జవాబు తెలియవలసియున్నది. పూర్వము దైవజ్ఞానమును తెలిసిన పెద్దలు, గురువును అనేక విధములుగా వర్ణించి చెప్పారు. వారు చెప్పిన విషయములను గమనిస్తే గురువు సాధారణ మనిషి కాడు, ఆయన ప్రత్యేకమైనవాడని తెలియుచున్నది. దానిని బట్టి ఒక మనిషి ఎప్పటికి గురువు కాలేడు, గురువే మనిషిగా రాగలడు. ఈమాట కొందరికి అర్థము కాకపోవచ్చును. దీని వివరమేమనగా! భూమిమీద పుట్టిన మనిషి ఎవడూ గురువు కానేకాడు. భూమిమీద పుట్టని మనిషి మాత్రమే గురువు కాగలడు. ఇపుడు మీరు ఇంకా సంశయములోనికి పోవు అవకాశముగలదు. భూమిమీద పుట్టని మనిషి ఉంటాడా? ఇవేమి మాటలు? ఈయనకేమైన తిక్కనేమో? అని కూడ నన్ను గూర్చి అనుకోవచ్చును. కొన్ని సందర్భములలో సత్యము అలాగే అనిపిస్తుంది. ఇక్కడ అందరిని ఆశ్చర్యపరచు సత్యమేమంటే, భూమిమీద గురువు జన్మించకుండా శరీరమును ధరించియుండును. కనిపించు శరీరముతోయున్న గురువును "గురు సాక్షాత్ పరబ్రహ్మ" అని పెద్దలన్నట్లు ఆయన దైవశక్తిలోని లేక దైవములోని అంశయే. దైవము అణువణువున అంతటా వ్యాపించియున్నది. అందువలన ఒక చోట మరణించడముగానీ, ఒకచోట జన్మించడము కానీ జరుగదు. అంతటానున్న దైవశక్తి తల్లిగర్భములో శిశుశరీరముగా తయారై, లోపలినుండియే చైతన్యము కల్గి అనగా సజీవముగా పుట్టుచున్నది. అలా పుట్టు శరీరమును తల్లి అండముతోగానీ, తండ్రి వీర్యకణముతోగానీ పనిలేదు. సాధారణ మనిషి పుట్టడానికి తల్లి అండము, తండ్రి వీర్యకణము తప్పనిసరిగ అవసరము. విశేషమేమంటే, తల్లిగర్భములో తయారైన సాధారణ మనిషి శరీము గర్భము నుండి జీవము లేకుండ పుట్టును. పుట్టిన సాధారణ శిశుశరీరములోనికి జీవము మరియు చైతన్యము లేక ఆత్మ, శిశువు పుట్టిన

తర్వాతే చేరును. గర్భమునుండి బయటికి వచ్చిన తర్వాత కదలిక వచ్చు లేక చైతన్యము వచ్చు మనిషి సాధారణ మనిషియే. అలాకాకుండ బహు అరుదుగా కొన్ని వేల సంవత్సరములకో లేక కొన్ని లక్షల సంవత్సరములకో గర్భములో నుండియే చైతన్యముతో పుట్టు శరీరము సాధారణ మనిషి కాదు. ఆ మనిషే గురువు. అలాంటి మనిషినే సాక్షాత్ దైవమని పెద్దలు పేర్కొన్నారు. గర్భమునుండి ఎవరు, ఎట్లు పుట్టుచున్నారో మనుషులకు తెలియకుండ పోయినది. అందువలన కొన్ని వేల సంవత్సరములకు భూమిమీదకు వచ్చు గురువును మానవులు గుర్తించలేక పోవుచున్నారు. అందువలన జ్ఞానము చెప్పువారందరిని గురువులుగ లెక్కించుచున్నారు. తాను గురువు అనుకొన్న వాడు బోధించు బోధ దైవజ్ఞానమును తెల్పునదో కాదో తెలియలేక పోవుచున్నాడు. అందువలన మానవుడు భూమిమీదకు వచ్చిన గురువును గుర్తించలేక తనకు నచ్చినవారినీ, తనకు ప్రపంచమేలు చేకూర్చు బోధలు చెప్పువారినీ గురువుగ లెక్కించడము జరుగుచున్నది.

గురువు మనిషిగ భూమిమీదకు వస్తే, అసలైన దేవున్ని గురించే బోధిస్తాడు తప్ప చిల్లర దేవుల్లను గురించి బోధించడు. ఆయన బోధ ప్రపంచ లాభములను చేకూర్చునదై ఉండక, కేవలము ముక్తిని కలుగ జేయునదైయుండును. ఆయన ఎప్పుడు భూమిమీదకు వచ్చినా, ఎన్ని మార్లు వచ్చినా, ఒకే దైవమును గురించి, ఒకే విధానముగా బోధించును తప్ప, వచ్చిన ప్రతిమారు వేరు వేరు విధానములను చెప్పడు. అంతేకాక దైవమునుండి దైవప్రతినిధిగ వచ్చిన గురువు, ఎప్పటికి తాను గురువునని ప్రజలకు తెలియనట్లుండును. సాధారణ మనిషిగా ఉంటూనే తన జ్ఞానమును ప్రజలందరు తెలుసుకొనునట్లు బోధించును. భూమి మీద మతములు, మతపరమైన బోధలు ఎన్నియుండినా, గురువు ఎప్పటికి మత సంబంధ బోధలు చెప్పక, ఆయన దైవమునకు సంబంధించిన బోధలే చెప్పును. భూమిమీద అర్థము చేసుకోలేని అజ్ఞాన ప్రజలు ఆయనను వ్యతిరేఖించినా, ఆయన బోధ విధానమును మార్చి, వారికి నచ్చినట్లు ఎప్పటికీ చెప్పడు. ఆయన బోధ, అంతట వ్యాపించిన, అందరికి సంబంధించిన దైవమును గూర్చియే ఉండును. గురువు ఇతర దేశములలో కూడ అక్కడ వేరు వేరు పేర్లతో చలామణి అయినప్పటికీ దైవజ్ఞానమును మాత్రమే తెల్పి, తానెవరైనది గుర్తించనట్లు ఉండి పోయాడు. మన భారతదేశములో గురువులుగా ఎందరో చలామణి అగుచున్నప్పటికీ దాదాపు ఐదువేల నూట డెబ్బయి సంవత్సరముల పూర్వము దైవము యొక్క అంశ ఉత్తరప్రదేశ్‌లో పుట్టినట్లు, ఆయనే శ్రీకృష్ణుడని ఇప్పటికి తెలుసుకోగలిగాము. కృష్ణుడు గురువు మాదిరి ఎప్పుడు ప్రవర్తించనప్పటికి ఆయన చెప్పిన బోధలను బట్టి ఆనాటి కృష్ణుడు గురువు అని కొందరు తెలియగల్గుచున్నారు.

ఈనాడు మనదేశములో పరమహంసలు, భగవాన్‌లు, బాబాలు, అమ్మలు, మహర్షులు, బ్రహ్మర్షులు అని పేరును తగిలించుకొన్న ఎందరో గురువులున్నారు కదా! వారిని గురువులని చెప్పక ఐదువేల సంవత్సరముల పూర్వము పుట్టిన కృష్ణున్ని గురువుగా చెప్పుచున్నారేమిటి? అని నన్ను మీరు ప్రశ్నించవచ్చును. దానికి మా జవాబు ఏమనగా! నేను ఎవరి ముఖస్తుతికి గానీ, ఎవరిని నొప్పించడానికి గానీ మాట్లాడడములేదు. సత్యమునే చెప్పాలనుకొన్నాము కాబట్టి, నేడు భూమిమీద ఎందరో బోధించు వారుండినప్పటికి, వారిలో ఎవరు గురువుగా లేడు, వారు చెప్పునవి ఒకరికొకరికి భిన్నమైన బోధలు. నేడు కృష్ణుడు చెప్పిన భగవద్గీతను బోధించు వారుండినప్పటికి, కృష్ణుడు చెప్పిన భావమునకు వేరుగా బోధిస్తున్నారు. కావున వారిని సరియైన బోధకులు కూడ కాదనియే చెప్పవచ్చును. ఇంతకు ముందే ఇతరుల చేత బోధింపబడిన

దానిని బోధించువాడు బోధకుడే అవుతాడు. గురువు ఎప్పటికి ఇతరులు బోధించిన దానిని బోధించదు. గురువు బోధించునది గురువుకు తప్ప, ఎవరికి తెలియదు. కావున దేనినైన చెప్పితే అది మొదటి బోధగయుండును. ఎవరు చెప్పని బోధను కానీ, ఎవరు వ్రాయని జ్ఞానమును గానీ చెప్పినవాడే గురువు. ఈ సూత్రమును అనుసరించి చూచినా, ఇంతకు ముందు రామానుజులు చెప్పిన బోధలనే బోధించువారందరు గానీ, ఇంతకుముందు శంకరాచార్యులు చెప్పిన బోధలు బోధించువారు గానీ, అట్లే రామకృష్ణ పరమహంస, వివేకానందుడు చెప్పిన వాటిని చెప్పువారుగానీ గురువులు కారు బోధకులేనని చెప్పవచ్చును. ఇప్పుడు మీరొక ప్రశ్న అడుగుటకు అవకాశము గలదు. ఇంతకు ముందు చెప్పబడిన బైబిలును గానీ, ఖురాన్‌ను గానీ, భగవద్గీతను గానీ చెప్పువారు గురువులు కాదు కదా! వారు కూడ కేవలము బోధకులే కదా! అని అడుగవచ్చును. దానికి సూత్రము ప్రకారము, బోధకులనియే మేము చెప్పితే, కృష్ణుడు అధర్మము చెలరేగినపుడు తిరిగి పుట్టుతానని చెప్పాడు కదా! అపుడు దేవుని అంశతో పుట్టిన వాడు కనుక గురువు అవుతాడా? లేక ముందు చెప్పిన తన బోధనే చెప్పుట వలన బోధకుడవుతాడా? అని ప్రశ్నించవచ్చును. దానికి మా జవాబు ఏమనగా! **తను బోధించిన దానిని తిరిగి తానే బోధించువాడు గురువే అవుతాడు కానీ ఎప్పటికీ బోధకుడు కాడు. ఇతరులు బోధించిన దానిని ఎట్లు బోధించినప్పటికీ, వాడు బోధకుడే అవుతాడు కానీ ఎప్పటికి గురువు కాలేడు.** ఈ సూత్రము ప్రకారము ఇప్పుడున్న వారు ఎవరు బోధకులో, ఎవరు గురువులో లెక్కించి మీరే తేల్చి చెప్పవచ్చును.

భూమిమీద ఎప్పుడైన గురువు ఒక్కడే ఉండుటకు అవకాశము కలదు. కానీ ఇద్దరు లేక ముగ్గురు గురువులుండుటకు వీలుకాదు. భూమిమీద అరుదుగా వచ్చు గురువు, ఏదో ఒక్క దేశములో ఒక్కడుగానే ఉంటాడు. ప్రస్తుతము భారతదేశములో చిన్న పెద్ద అందరిని కలుపుకుంటే వేయిమంది గురువులుగా చలామణి అగువారు ఉన్నారనుకొందాము. ఒకవేళ దేవుని అంశ (శక్తి) భూమిమీదకు మనిషిగా వచ్చియుంటే, వేయిమందిలోనూ గురువు ఒక్కడే ఉంటాడు. మిగత 999 మంది గురువులు కారు, కేవలము బోధకులేనని తెలియవచ్చును. 999 మందిలో ఎంత పెద్ద పేరుగాంచిన వారుండినప్పటికీ, మనము ఎంత పెద్దగా భావించుకొన్నప్పటికీ వారు గురువులుకారని తెలియవలెను. ఒకవేళ ప్రస్తుత కాలములో దేవుని అంశ భూమిమీద పుట్టియుండకపోతే, వేయిమందిలో కూడ గురువులేడనియే చెప్పవచ్చును. కొన్ని లక్షల సంవత్సరములలో, ఒక్కమారు మాత్రమే వచ్చిపోవు గురువును గుర్తించుట కష్టమైన పనియే. ఎప్పుడో, ఎన్ని సంవత్సరములకో అరుదుగా వచ్చు గురువును, ఎల్లపుడు భూమిమీద ఉంటాడనుకోవడము పొరపాటు. కొందరు గురు పరంపర అని ఒకరు తర్వాత ఒకరు రాజులు సింహాసనము ఎక్కినట్లు నేనూ, నా తర్వాత ఇతను, ఇతను తర్వాత అతను గురువనుకోవడము పొరపాటు కాదా! వాస్తవానికి గురుపరంపర భూమిమీద ఉండదు. ఒక్కమారు గురువు భూమిమీదకు వస్తే తిరిగి రావడానికి ఎంతో సుధీర్ఘకాలము పట్టుతుంది. అందువలన గురువు భూమి మీద ఎల్లప్పుడూ ఉండడు. గురువులేని కాలములో, గురువు కాని వారిచేత వినే బోధంతయు గురువులేని బోధ అనియే చెప్పవచ్చును. అందువలన పూర్వము "గురువు లేని విద్య గ్రుడ్డి విద్య" అన్నారు. ఇంతవరకు విద్య అను దానికి అర్థము తెలుసుకొన్నాము. అలాగే గురువు అను పదమునకు వివరము తెలుసు కొన్నాము. గురువులేని కాలమునూ, గురువున్న కాలమును గురించి చెప్పుకొన్నాము. ఇక గ్రుడ్డివిద్యకు అర్థము తెలుసుకొందాము. "గురువులేని విద్య గ్రుడ్డి విద్య" ఎలా అగుచున్నదో తెలుసుకొందాము.

ప్రత్యక్షముగ గురువు ఉండి చెప్పిన బోధను ఆశ్రయించడము వలన ఆ విద్య మార్గమును బాగా చూపించి గమ్యమును చేర్చును. పుట్టిన ప్రతి మనిషికి ముక్తిని పొందడము ముఖ్యము. ముక్తి అనునది గమ్యము కాగా, జ్ఞానము లేక విద్య మార్గముకాగా, గురువు దారిని చూపించు దీపమైయున్నాడని అనుకొందాము. దీపము లేకుండా మార్గములో పోలేము. దీపము లేని ప్రయాణము అంధకారమయమని తెలియవలెను. దానివలన గురువులేని జ్ఞానము గ్రుడ్డివాని ప్రయాణములాంటిదని చెప్పవచ్చును. గురువు భూమి మీదకు వచ్చినపుడు 40 లేక 50 సంవత్సరములుగానీ, నాలుగు లేక ఐదు సంవత్సములుగానీ, చెప్పిన బోధనే చూపున్న వెలుగైన బోధ అని చెప్పవచ్చును. గురువు పోయిన తర్వాత అదే బోధను ఉన్నదున్నట్లు ఇతరులచేత తెలుసుకొనినప్పటికీ, అది గురువు యొక్క బోధయే అగును. కావున అది కూడ చూపుగల విద్యయే అగును. అట్లుకాక గురువు చెప్పి పోయిన తర్వాత అది ఆయన భావముతోకాక వేరు భావముతో చెప్పబడితే అది గురువు యొక్క బోధకాదు. అందువలన అట్టిదానిని గ్రుడ్డి విద్యయే అని చెప్పవచ్చును. గురువు చెప్పిన జ్ఞానమే భావము వేరైనపుడు, అది గ్రుడ్డివిద్య అయితే, గురువు చెప్పినది కాకుండయున్న ఏ జ్ఞానమునైన గ్రుడ్డివిద్యయే అని చెప్పవచ్చును. అందువలన నేడు భగవద్గీతకు వేరుగా ఉన్న శైవ, వైష్ణవములుగానీ, శ్వాసమీద ధ్యాసలు గానీ, మరి యే ఇతర మార్గములుగానీ మోక్షమను గమ్యమును చేర్చలేని గ్రుడ్డివిద్యలనియే చెప్పవచ్చును. ఇపుడు కొందరికి మా మీద కోపము వచ్చియుండవచ్చును అయినా పరవాలేదు నేను చెప్పునది సత్యమా కాదా మీరే చూచుకోండి. నేడు బోధించు వారందరిలో ఏ ఒక్కడు గురువు లేనప్పుడు, బోధించబడు బోధలలో ఏ ఒక్కటి గురువు చెప్పినది కానపుడు, అది గ్రుడ్డి విద్యకాక ఏమగును? అటువంటి దానినే గురువులేని విద్య గ్రుడ్డివిద్య అన్నారు. ఒకవేళ గురువునని పేరు పెట్టుకొన్న వానివైతే నీవు గురువువో, బోధకునివో సూత్రము ప్రకారము చూచుకో! ఒకవేళ నీవు బోధకునివైతే నీవు బోధించు బోధ భగవద్గీతలో గురువు చెప్పినదో కాదో, సూత్రము ప్రకారము చూచుకో! ఒకవేళ నీవు భగవద్గీతనే బోధిస్తూయుంటే అది గురువు చెప్పినట్లే ఉందో లేదో చూచుకో! ఒకవేళ నీకు బోధలు తెలుసుకోనే వానివైతే నీవు ఆశ్రయించి నది గురువునా బోధకున్నా చూచుకో, ఒకవేళ నీవు బోధకుని ఆశ్రయించియుంటే నీవు వింటున్న బోధలుగానీ, నీవు చదువుచున్న బోధలు గురుబోధలో కాదో చూచుకో. ఒకవేళ నీకు గురుబోధలు తెలియకుండ బోధకుల బోధలు మాత్రమే తెలియుచుంటే అవి గ్రుడ్డివిద్యలేనని, మోక్షమును చేర్చలేవని తెలుసుకో. ఒకవేళ ఇంతవరకు గురువును ఆశ్రయించక బోధకున్ని ఆశ్రయించినా, గురువు యొక్క జ్ఞానము తెలియక బోధకుల మతవర్గ బోధలే తెలిసియుండినా "గురువు లేని విద్య గ్రుడ్డి విద్య" అను మాట నీకు పూర్తి వర్తించుచున్నదని తెలుసుకో. ఇప్పటినుండైన గురువునుగానీ లేక గురువుయొక్క బోధను గానీ ఆశ్రయించి వెలుగులో ప్రయాణించవలెను. ఇపుడు గురువు లేకపోయినా గురువు చెప్పిపోయిన ఆయన బోధ శాశ్వితముగా భగవద్గీత రూపములోనున్నది. కావున గీతను ఆశ్రయించుము. భగవద్గీతలు గురువు చెప్పిన భావముతో కాక వేరు భావముతోనున్నవి దాదాపు మూడువందలు భారతదేశములో ఉన్నాయి. అట్లని గురువుయొక్క భావము లేనిది, భూమిమీద లేదని చెప్పుటకు వీలులేదు. అటువంటి భగవద్గీతను ఆశ్రయించి అసలైన భావమును తెలుసుకొని "గురువున్న విద్య చూపున్న విద్య" అని నిరూపించుకో. శ్రద్ధ తక్కువయున్న చాలామందికి గురువులేని విద్య గ్రుడ్డివిద్య అయితే ఎక్కువ శ్రద్ధయున్న కొందరికి గురువున్న విద్య చూపుగల విద్యయని తెలియునట్లు చేస్తాము.